
క్లుప్తంగా...

'రాష్ట్రంలో అవినీతి పాలన'

గోల్కొండ: రాష్ట్రంలో అవినీతి పతాక స్థాయికి చేరిందని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి. సత్యనారాయణ అన్నారు. స్వయంగా మంత్రులు పీకల్లోతు అవినీతో కూరుకుపోయారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నో స్కాంలలో బీఆర్ఎస్ నాయకులు, మంత్రుల ప్రమేయం ఉందన్న విషయాలు స్పష్టమయాయని ఆయన అన్నారు. పాలక పార్టీ ఎమ్మెల్యేలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతి పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు.

టీఎన్జీజీఓస్ ఆధ్వర్యంలో జోరుగా దశాబ్ది వేడుకలు



ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ దశాబ్ది వేడుకలు జోరుగా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈనెల 14న టీఎన్జీఓస్ భవనంలో మహిళా ఉద్యోగుల కోసం కేన్సర్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కమర్షియల్ టాక్స్ కమిషనర్ సీతాప్రసాద్, సీఆర్‌ట బాల మాయాదేవి, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ జయలత, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీలు ట్వింకిల్ జాన్, సుభాషిణి, పెన్షన్ జాయింట్ డైరెక్టర్ వసుంధర తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతామని వివరించారు.

బోనాల జాతరకు ఆలయం ముస్తాబు



చార్మినార్: ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని మీరాలంమండిలోని మహంకాళేశ్వర ఆలయాన్ని ముస్తాబుచేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయానికి ఆకట్టుకునే రీతిలో రంగులను వేస్తున్నారు. ఈనెల 20న అమ్మవారికి అభిషేకం నిర్వహించనున్నామని.. ఇందులో భాగంగా ఆలయంలో తగిన ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

ఘనంగా కాశిబుగ్గ శివాలయంలో పూజలు

జియాగూడ: ఆషాఢమాసం శివారాధన ఉత్సవాలు కిషన్‌బాగ్ కాశిబుగ్గ శివాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున 4 గంటలకు మహా రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, మధ్యాహ్నం అఖండ హారతి, యజ్ఞ మహోత్సవం చివరగా అన్నదాన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా శివభక్తుడు కిషన్ శర్మ, విజయ్ మహారాజ్, శ్రీ పరశురామ్ సేవా మండల్ వ్యవస్థాపక అధ్యక్షుడు నవరతన్ ఇందోరియా, గోపాల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శ్రేయ కూచిపూడి నృత్య ప్రదర్శన



నాంపల్లి: నృత్య గురువు భాగవతుల సేతురాం వద్ద శిష్యరికం పొందిన కుమారి వి.శ్రేయ కూచిపూడి నృత్య రంగ ప్రవేశం అలరింపజేసింది. శ్రీ కూచిపూడి నృత్య నిలయం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో శ్రేయ కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. తరంగం, దశావతార శబ్దం, జావలి, మహిషాసురమర్దిని స్తోత్రం, భామా కలాపం, తిల్లాన అంశాలకు చక్కగా నర్తించి అతిథుల ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ, సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం నృత్యశాఖ ఆచార్యులు డాక్టర్ పి.రమాదేవి, తెలుగు వర్సిటీ నృత్యశాఖ శాఖాధిపతి డాక్టర్ వనజా ఉదయ్ హాజరై కుమారి వి.శ్రేయను అభినందించారు.

జోరుగా సర్దార్ మహల్ భవనం సుందరీకరణ పనులు

- ఇప్పటికే శిథిలావస్థకు చేరిన సర్దార్ మహల్ భవనం
- రూ.30 కోట్ల నిధులతో కొనసాగుతున్న పనులు
- జీహెచ్ఎంసీ పర్యవేక్షణలో పనులు చేపట్టిన కుడా
- పనుల అనంతరం ఇక్కడ ఆర్ట్ గ్యాలరీతో పాటు హెరిటేజ్ హోటల్‌ల ఏర్పాటు



కొనసాగుతున్న సుందరీకరణ పనులు

చార్మినార్: వారసత్వ సంపదైన సర్దార్ మహల్ భవనానికి బ్యూటిఫికేషన్ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. సుందరీకరణ పనుల అనంతరం ఇక్కడ ఆర్ట్ గ్యాలరీతో పాటు హెరిటేజ్ హోటల్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఈ భవనానికి మరమ్మతులు జరుగుతున్నాయి. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ తన సతీమణి అయిన సర్దార్ బేగం ప్రేమకు గుర్తుగా ఈ భవనం నిర్మించారు. ఆమెకు కానుకగా ఇవ్వడానికి నిర్మించినప్పటికీ.. అప్పట్లో ఆమె దీనిని నివాస భవనంగా తీసుకోవడానికి నిరాకరించింది. నిజాం కాలం అంతరించిన అనంతరం ఈ భవనాన్ని భారత ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవడంతో 2018 వరకు ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పర్యవేక్షణలో కుడా ఈ పనులను చకాచకా నిర్వహిస్తున్నప్పటికీ.. పనుల్లో జాప్యం జరుగుతోంది. గడువు లోపు భవనం సుందరీకరణ పనులు పూర్తికాకపోవచ్చునని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు అంటున్నారు.

ఇండో–యూరోపియన్ నిర్మాణ శైలీలో..

ఇండో–యూరోపియన్ నిర్మాణ శైలీలో నిర్మించిన ఈ భవనాన్ని రాజస్థాన్‌లోని నీమ్ రానా ఫోర్టు ప్యాలెస్‌గా తీర్చిదిద్దనున్నారు. హెరిటేజ్ కట్టడాల పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా సర్దార్ మహల్ భవనానికి మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి. రూ.30 కోట్ల నిధులతో కులీకుతుబ్ షా నగరాభివృద్ధి సంస్థ(కుడా)కు జీహెచ్ఎంసీ ఈ సుందరీకరణ పనుల బాధ్యతలను అప్పగించింది. పూర్వ వైభవం దెబ్బతినకుండా ఎంతో జాగ్రత్తగా ఈ పనులు చేయాల్సి ఉంటుందని.. హడావుడిగా చేసే పనులు కావంటున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నా.. గడువు లోపు పూర్తయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. భవనంలోని చెక్క మెట్లన్నీ ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్నాయి. కింది నుంచి పై అంతస్తుకు వెళ్లడానికి ఈ శిథిలావస్థకు చేరుకున్న చెక్క మెట్లు ప్రధాన దారి. దీంతో వీటి పై నుంచి వెళ్లడానికి గతంలో బిక్కుబిక్కుమంటూ వెళ్లారు. ప్రస్తుతం వీటి స్థానంలో కొత్త నిర్మాణాలు చేపట్టనున్నారు.

1969 నుంచి కొనసాగిన బల్దియా కార్యాలయాలు..

పాతబస్తీ చార్మినార్ సమీపంలోని సర్దార్ మహల్ భవనంలో 1969 నుంచి బల్దియా కార్యాలయాలు కొనసాగాయి. ఈ భవనంలో బల్దియా కార్యాలయాలకు ముందు 1967–68 కాలంలో ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి విభాగం దాదాపు రెండేళ్ల పాటు కొనసాగింది. అనంతరం బల్దియా కార్యాలయాలు పనిచేశాయి. జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంగా కొనసాగిన సర్దార్ మహల్ భవనంలో సర్కిల్–6,7,8,9,10 డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలతో పాటు ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, యూసీడీ, చార్మినార్ ఫెడిస్ట్రలైజేషన్ జోన్ కార్యాలయం, జనన, మరణ నమోదు, ధ్రువీకరణ కార్యాలయాలు పనిచేశాయి. పాతబస్తీలోని చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ తదితర శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాలు ఈ కార్యాలయం పరిధిలోనే పని చేశాయి. 2018 నుంచి బల్దియా కార్యాలయాలు ఈ భవనాన్ని ఖాళీ చేసి నర్కిపూల్‌బాగ్‌కు మారడంతో అప్పటి నుంచి సర్దార్ మహల్ భవనం ఖాళీగా మారింది.

ప్రపంచ పర్యాటకులకు ఆకర్షణగా..



పాతబస్తీని సందర్శించే ప్రపంచ పర్యాటకులకు సర్దార్ మహల్ హెరిటేజ్ భవనం అత్యంత ఆకర్షణీయంగా మారనుంది. రూ.30 కోట్ల నిధులతో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి సందర్శించారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

– నామా స్రామాట్ అశోక్, చార్మినార్ జోనల్ కమిషనర్

మహిళలకు అండగా మజ్లిస్ పార్టీ



మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మహిళలకు మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం కార్వాన్‌లో మహిళా సెల్ఫ్ గ్రూపులకు ఆయన చెక్కులు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మహిళా స్వయం ఉపాధి గురుకలకు మంజూరైన రూ.1.25 కోట్ల చెక్కులను మహిళా గ్రూపులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కోసం ముందుకు వచ్చే మహిళలను తామెప్పుడూ ప్రోత్సహిస్తామని ఆయన అన్నారు. ముఖ్యంగా చదువుకున్న యువతులు ఉద్యోగాల జోలికి పోకుండా తమ ఇంటి వద్దనే వ్యాపారాలు చేసుకోవడానికి ముందుకు వస్తున్నారని ఆయన అన్నారు. మరోవైపు మహిళ పొదుపు సంఘాల సమావేశాలను స్థానిక కమ్యూనిటీ హాళ్లలో నిర్వహించుకోవాలని తాను వారికి సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి డివిజన్ కార్పొరేటర్ ప్రతినిధి హారూన్ ఫరాన్, యూసీడీ అధికారులు తదితరులున్నారు.

లింగాయత్‌లకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలి



డాక్టర్ విజయ్‌కుమార్

గౌలిపురా: ప్రభుత్వం వీరశైవ లింగాయత్, లింగబలిజ కులస్తులకు, కులవృత్తులకు అందించే లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించాలని వీర శైవ లింగాయత్ లింగబలిజ సంఘం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. లింగాయత్ కులస్తులలో కూడా 90 శాతం మంది సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. లింగాయత్ ఓట్లతో రాజకీయ పార్టీలు లబ్ధి పొందుతున్నా.. సంక్షేమ పథకాలలో అవకాశాలు కల్పించడం లేదన్నారు. చేతివృత్తులు, కులవృత్తులు లేని అనేక కులాలు బీసీల్లో ఉన్నాయని.. అందులో లింగాయత్‌లు కూడా ఒకటన్నారు. ఈ నేపథ్యంలో లింగాయత్‌లకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకాన్ని అందజేయడంతో పాటు లింగాయత్‌లను బీసీ–డీ నుంచి ఓబీసీల్లో చేర్చాలని.. లింగాయత్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న గంగాపురం కావ్యారెడ్డి

గోల్కొండ: గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి గంగాపురం కావ్యారెడ్డి అన్నారు. జనహిత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివంగత దేవర కరుణాకర్ జ్ఞాపకార్థం మంగళవారం గుడిమల్కాపూర్‌లోని దేవల్ ఝాం సింగ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు జనహిత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, దేవర వంశీ, దేవర శ్రీనివాస్, అశ్విన్ మోది తదితరులున్నారు.

నకిలీ సర్టిఫికెట్లను ఇస్తున్న ఇద్దరికి రిమాండ్

సంతోష్‌నగర్: అనధికారిక కేంద్రాల్లో టీకాలు వేసి నకిలీ ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను జారీ చేస్తున్న ఇద్దరిని మంగళవారం సంతోష్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఆసిఫ్ ఉద్దీన్, మళ్ల మధుకర్ సంతోష్‌నగర్ అపోలో ఆస్పత్రి ఎదురుగా ఏఆర్ ట్రావెలర్స్ వ్యాక్సిన్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా కేంద్రాలను నిర్వహిస్తూ టీకాలు వేస్తూ నకిలీ ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న సంతోష్‌నగర్ పోలీసులు దాడులు నిర్వహించిన మహ్మద్ ఆసిఫ్ ఉద్దీన్, మళ్ల మధుకర్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఎల్లో వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

బాలుడి ఆత్మహత్య

జియాగూడ: ప్రేమించిన యువతి తనతో మాట్లాడటం లేదని మనస్తాపం చెందిన ఓ బాలుడు (17) ఆత్మహత్య చేసుకున్న ఘటన కుల్సుంపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని సబ్జిమండి ప్రాంతాంలో ఉంటున్న ఓ బాలుడు ఇంటర్ చదువుతున్నాడు. తాను ప్రేమిస్తున్న యువతి కొన్ని రోజులుగా తనతో ఫోన్‌లో మాట్లాడడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. బాలుడి తల్లి, తమ్ముడు బయటకు వెళ్లగా అక్క నేహాసింగ్ జూ పార్కుకు వెళ్లింది. అదే సమయంలో ఆ యువతికి మెస్సెజ్ పెట్టి ఇంటో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నేహా సింగ్ తిరిగి ఇంటికి వచ్చి చూసి విషయాన్ని పోలీసులకు తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో సంచరిస్తున్న నిందితుడికి నెల రోజుల జైలు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో కత్తితో సంచరిస్తున్న యువకుడికి న్యాయస్థానం నెల రోజుల జైలు శిక్షను విధించింది. ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.జావిద్ తెలిపిన వివరాల ప్రకారం.. నలాల ప్రాంతానికి చెందిన ఖలీం హమీద్(36) కత్తితో అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 9వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పరచగా నిందితుడికి 30 రోజుల శిక్షను విధిస్తూ తీర్పును వెలువరిచారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

సంతోష్‌నగర్: ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తిని సంతోష్‌నగర్ పోలీసులు అరెస్ట్ మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ మోయిన్‌బాగ్‌కు చెందిన ఖతిజా అబ్దుల్ రహీం తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 11న రాత్రి 10.30 గంటలకు ఇంటి సమీపంలోని మసూద ఫంక్షన్ హాల్‌లో వలీమా డిన్నర్‌కు వెళ్లారు. కాగా 12న సాయంత్రం 4.30 గంటలకు తిరిగి ఇంటికి చేరుకోగా.. ఇంట్లో తలుపుల పగలగొట్టి బీరువాలోని వస్తువులను చిందర వదరంగా పడేశారు. బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, రెండు సెల్‌ఫోన్లతో పాటు రూ.43,000 వేల నగదు కనిపించకుండా పోయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం దొంగతనానికి పాల్పడిన మోయిన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ హుస్సేన్ ఆలియాస్ జుబేర్ (22)ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి బంగారం, నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని వాహనదారుడికి గాయాలు

సంతోష్‌నగర్: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు గాయాలైన ఘటన మంగళవారం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తార్నాక మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన మహ్మద్ అల్తామష్ (54) ప్లంబర్. సోమవారం రాత్రి 2 గంటల సమయంలో పనులను ముగించుకొని చాంద్రాయణ గుట్ట మీదుగా ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. డీఆర్‌డీఎల్ సిగ్నల్ వద్దకు రాగానే చాంద్రాయణ గుట్ట నుంచి వేగంగా వస్తున్న లారీ అల్తామష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అల్తామష్ కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అల్తామష్‌ను చికిత్స నిమిత్తం ఒవైసీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఆశీష్‌కుమార్ యాదవ్



అబిడ్స్: సీఎం కేసీఆర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ కలిశారు. బీఆర్ఎస్ దశాబ్ది వేడుకలను పురస్కరించుకుని ఆయన కేసీఆర్‌ను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గంలో అభివృద్ధి, రాజకీయ పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

బోనాలు తెలంగాణకు తలమానికం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: బోనాల ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రానికే తలమానికం వంటివని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల నజర్ బోనం, జులూస్ ఆహ్వాన పత్రాన్ని మంగళవారం అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు ప్రజలకు అమ్మవారిపై ఉన్న భక్తిని చాటుతున్నాయని, అదే విధంగా గోల్కొండ కోటలో జరిగే బోనాలకు అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారని ఆయన అన్నారు. అమ్మవారు తమను చల్లగా చూడాలని, పాడిపంటలు బాగా పండాలని కోరుకుంటారని ఆయన తెలిపారు. కోరికలు మన్నించిన అమ్మవారికి మొక్కలు చెల్లించుకోవడమే బోనాల విశిష్టత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి సురేష్ చారి తదితరులున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే మహిళా సంక్షేమం



బీఆర్ఎస్ మహిళా సంక్షేమం వేడుకల్లో ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: బీఆర్ఎస్ హయాంలోనే మహిళా సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున ప్రవేశపెట్టామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం మహిళల కోసం విప్లవాత్మక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం గోషామహల్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య పరిరక్షణకు భద్రత కోసం ప్రభుత్వం అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బేగంబజార్ ఇన్‌చార్జ్ పూజవ్యాస్ బిలాల్, శంకర్ సింగ్ జమేదార్, గోపాల్ సింగ్ లోధ్, శైలేష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ గార్డెన్ చెత్త తరలింపుపై ముదురుతున్న వివాదం



గార్డెన్‌లో పేరుకుపోయిన చెత్త

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్స్‌లో పేరుకుపోయిన చెత్త తరలింపు విషయమై జీహెచ్ఎంసీ, ఉద్యానవన శాఖల మధ్య సమన్వయ లోపం నెలకొంది. చెత్త తరలింపు వ్యవహారం ముదిరి పాకానపడింది. రెండు శాఖల మధ్య గత కొంతకాలంగా వివాదాస్పదం అవుతూ వస్తోంది. పార్కులో గుట్టలుగా చెత్త పేరుకుని పోయింది. గార్డెన్‌లో చెత్త తరలింపు జీహెచ్ఎంసీ చూసుకుంటుందని ఉద్యానశాఖ అధికారులు, కాదు తమకేమి సంబంధం లేదని జీహెచ్ఎంసీ మాటల యుద్ధానికి దిగుతున్నాయి. తద్వారా రెండు శాఖలు కాలక్షేపం చేయడంతో పార్కు నిర్వహణ అధ్వానంగా తయారయ్యింది. ఇటీవలే పేరుకుపోయిన చెత్తకు కొందరు తగులబెట్టడం వివాదస్పదమైంది. పార్కు సుందరీకరణ దేవుడెరుగు, పార్కులో డంప్ చేసిన చెత్తను తరలించాలని పర్యాటకులు, సందర్శకులు, వాకర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రైవేట్ వాహనాలకు ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వడంతో పబ్లిక్‌గార్డెన్ కాలుష్యకాసారంగా మారిందని, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులు రోజంతా పార్కులో పార్కింగ్ చేసుకుంటూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని, ఉద్యానవన శాఖ అధికారులు వీరికి వత్తాసు పలుకుతూ పార్కును కాలుష్యమయం చేస్తున్నారని పర్యావరణ వేత్తలు, పబ్లిక్‌గార్డెన్ వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యూనివర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయ పార్ట్‌టైం అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలనే సంఘం పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రంలోని మహిళా విశ్వ విద్యాలయం పార్ట్‌టైం అధ్యాపకులు మహా ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన తొలి మహిళా విశ్వ విద్యాలయంలో రెగ్యులర్ అధ్యాపకులు కేవలం 28 మందితో కొనసాగుతున్న ఈ విశ్వ విద్యాలయంలో 100కు పైగా పార్ట్‌టైం అధ్యాపకులే అన్ని విద్యా అర్హతలు, పీహెచ్‌డీ, టెట్, సెట్ కలిగి, ఫుల్ వర్క్‌లోడ్ కలిగిన ప్రతి పార్ట్‌టైం అధ్యాపకులను తక్షణం రెగ్యులరైజ్ చేయాలని భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎలల దత్తాత్రేయ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్క కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులు కూడా ఉండరు అని తెలిపిన సీఎం జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ అధ్యాపకులను క్రమబద్ధీకరించిన పద్ధతిలోని రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులను కూడా తక్షణం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎల్చల దత్తాత్రేయ, ఉపాధ్యక్షులు డాక్టర్ కవిత, డాక్టర్ మాధవి, రాజగోపాల్ శంకర్, మోహన్, దివ్య, సోనియారాజు, గౌసియా బేగం పాల్గొన్నారు.

సత్కారం



బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరి చారిని సత్కరిస్తున్న దృశ్యం

జియాగూడ: జియాగూడలో బీఆర్ఎస్ పార్టీ ఎంతో పటిష్టతతో పనిచేస్తుందని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బి.నరహరిచారి అన్నారు. ఈ మేరకు మంగళవారం టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ ఆయనను సన్మానించి సత్కరించారు. అనంతరం నరహరిచారి మాట్లాడుతూ.. బీసీలకు లక్ష రూపాయాల రుణ సౌకర్యం సీఎం కేసీఆర్ ప్రకటించడం అన్ని విధాల వారి ఎదుగుదలకు సహకారం అందిస్తున్నారన్నారు. దళితబంధు, పెన్షన్, డబుల్‌బెడ్‌రూమ్ లాంటి పథకాలు జియాగూడలో విజయవంతంగా నిరుపేదలకు లబ్ధి చేకూరాయన్నారు.

'పరిధులను మార్చడం సరికాదు'



గౌలిపురా: పాతబస్తీ భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళికానగర్, లలితాబాగ్, సరస్వతీనగర్ తదితర బస్తీలను చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తరలించడం ఎంతవరకు సమంజసమని కాళికానగర్ మాజీ అధ్యక్షులు ధరమ్‌కార్ రాజేందర్ జీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన బస్తీ వాసులతో భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీకి ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతాల్లో ఏదైనా క్రైమ్ జరిగితే దాదాపు 5 కి.మీల దూరానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. భవానీనగర్ పీఎస్ పరిధిలోని కాళికానగర్, లలితాబాగ్, సరస్వతీనగర్ ప్రాంతాలను భవానీనగర్ పీఎస్ పరిధిలోనే ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రాకేశ్, బాబు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కామెడీ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది'

గన్‌ఫౌండ్రీ: ఈనెల 22వ తేదీ నుంచి కామెడీతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాన్ని ప్రారంభిస్తున్నట్లు యువ దర్శకుడు కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం రవీంద్రభారతిలోని సినివారంలో ఆయన చిత్ర విశేషాలను పంచుకున్నారు. ప్రముఖ బ్యానర్‌లో ఈ చిత్రం నిర్మాణం జరుగుతుందని ఈ చిత్రంలోని హీరో హీరోయిన్ల వివరాలను త్వరలో అధికారికంగా వెల్లడిస్తామన్నారు. ఆగస్టు 2వ వారం నుంచి చిత్రం షూటింగ్ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

అఫ్జల్‌గంజ్: సత్య సాయి సేవా సంస్థలు కోఠి సమితి తరఫున ఉచిత హోమియో క్లినిక్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం పర్చుకోవాలని సమితి కన్వీనర్ విశ్వేశ్వర శాస్త్రి అన్నారు. ఈ మేరకు ఉస్మాన్‌గంజ్‌లోని లిబర్టీ ఆప్టికల్స్ ప్రాంగణంలో ఉచిత హోమియో క్లినిక్‌ను ప్రారంభించారు. ప్రతి బుధవారం డాక్టర్ సింధు భైరవి ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.